సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం | 20 | జూన్ | 2025



పోడు.. తీరని గోడు! 10లో▸

అటవీ భూముల సాగుపై వివాదం ఆగడం లేదు. ఏటా వానాకాలం విత్తనాలు వేసే వేళ అటవీ అధికారులు, ఆక్రమణదారుల మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి.



అధ్వాన రోడ్లతో అవస్థలు 11లో▸

గతంలో కురిసిన వర్షాలకు గ్రామీణ రహదారులు, వంతెనలు కోతకు గురయ్యాయి. తాత్కాలిక వంతెనలు, రహదారులు నిర్మించగా ఇటీవలి వర్షాలకు కొట్టుకుపోయాయి.

గరిష్టం/కనిష్టం
33.0/26.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడా వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఉచిత వృత్తివిద్య శిక్షణ

ఇచ్చోడ: కేంద్ర ప్రభుత్వం ద్వారా నిరుద్యోగ యువతీయువకులకు వృత్తివిద్య శిక్షణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ ద్వారా ఆదిలాబాద్ జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ శాఖ డైరెక్టర్ శ్యామల తెలిపారు. గురువారం ఇచ్చోడలో విలేకరులతో మాట్లాడారు. ఇచ్చోడ, బజార్‌హత్నూర్, సిరికొండ మండలాల్లో శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. డ్రెస్‌మేకర్ (టైలరింగ్), బ్యూటీషియన్ కోర్సు, కంప్యూటర్ ఆపరేటర్, మగ్గం వర్క్, డ్రైవింగ్, హెల్త్‌కేర్, తేనెటీగల పరిశ్రమపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తిగలవారు ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఇచ్చోడ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9963098573, 9110732460 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

హాజరు శాతం పెంచాలి

బజార్‌హత్నూర్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచి తరగతులను పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం మండలంలోని కాండ్లీ, గిర్నూర్, పిప్రి, బజార్‌హత్నూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలు, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. పిప్రి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎల్‌ఈడీ టీవీ, కంప్యూటర్, టీషర్టులు అందించిన దాతలు విశాల్, భోజారెడ్డి, ప్రమోద్‌రెడ్డిని అభినందించారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో స్థానికులు ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాలని కోరారు. పాఠశాలల్లో ఉత్తమమైన విద్యను అందిస్తామని తెలిపారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఎంఈవో కిషన్‌గుప్తా, సీసీ రాజేశ్వర్, ప్రధానోపాధ్యాయులు కౌసల్య, భూమన్న, సురేందర్‌రెడ్డి, లక్ష్మి, ప్రేంకుమార్, సదానందం, ఉపాధ్యాయులున్నారు.

ఇంద్రవెల్లికి చేరిన మొక్కలు



లారీ నుంచి మొక్కలు దించుతున్న కూలీలు

ఇంద్రవెల్లి: అమరవీరుల స్తూపం వద్ద స్మృతివనం ఏర్పాటులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.కోటితో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. కాగా, స్తూపం ప్రాంగణంలో సుందరీకరణ కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రి నుంచి గురువారం మొక్కలు తీసుకువచ్చారు. సుమారు 40 రకాల మొక్కలు తీసుకువచ్చినట్లు రగల్ జెండా కమిటీ అధ్యక్షుడు తొడసం నాగోరావ్ తెలిపారు. త్వరలో మొక్కలను స్తూపం ప్రాంగణంలో నాటి అమరవీరుల స్తూపాన్ని మరింతా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

ఖాళీ బిందెలతో ఆందోళన



ఆందోళన చేస్తున్న ఆయా కాలనీల వాసులు

నార్నూర్: తాగునీటి కోసం మండల కేంద్రంలోని వడ్డెర, మైనార్టీ కాలనీల వాసులు గురువారం ఆందోళనకు దిగారు. స్థానిక మసీద్ వద్ద ప్రధాన రోడ్డుపై ఖాళీ బిందెలతో బైఠాయించారు. దీంతో రెండు గంటలపాటు రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్సై అఖిల్ అక్కడికి చేరుకుని సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. నెలరోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదని తెలిపారు. గ్రామపంచాయతీ ద్వారా సరఫరా అయ్యే నీటిని కొందరు అక్రమ నల్లాలు బిగించి వాడుకుంటున్నారని ఆరోపించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని తెలిపారు. అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆరోపించారు. రాతపూర్వకంగా సమస్యలు రాసిస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని ఎస్సై హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

కైలాస్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖ, అంగన్‌వాడీ, మున్సిపల్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఓపెన్ స్కూల్ ప్రవేశాలు, ఉల్లాస్ అమలు, ప్రభుత్వ పాఠశాలల్లో అంగన్‌వాడీ చిన్నారుల నమోదు, బడి బయట పిల్లలు, బడిమానేసిట్లు గుర్తించిన పిల్లల వివరాలు తెలుసుకున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాసరెడ్డి, డీపీవో రమేశ్, డీడబ్ల్యూవో మిల్కా, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ అశోక్ తదితరులున్నారు.

చతికిల బడి..



మావల జెడ్పీఎస్ఎస్‌లో అసంపూర్తి భవనంలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

- సమస్యల్లో సర్కారు స్కూళ్లు
- పిల్లలున్నచోట టీచర్లు లేరు
- సార్లుంటే విద్యార్థులు రారు
- చాలాచోట్ల వసతులు కరువు
- సమస్యల మధ్యే చదువులు

జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు: 3,067
పనిచేస్తున్నవారు : 2,667
ఖాళీలు : 400
డీఈవో పరిధి పాఠశాలలు : 739
విద్యార్థుల సంఖ్య : 65వేలు

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడుల్లో విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారు. జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులున్న చోట సరిపడా ఉపాధ్యాయులు లేరు. ఉపాధ్యాయులున్నచోట విద్యార్థులు బడికి రారు. సరిపడా తరగతి గదులు లేక పలు పాఠశాలల్లో రెండు, మూడు తరగతుల విద్యార్థులను ఒకేచోట కూర్చోబెట్టి బోధిస్తున్నారు. జిల్లాలో 25 పాఠశాల భవనాలు శిథిలావస్థలో ఉండగా, 54 పాఠశాలల్లో విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులు లేరు. విద్యార్థులు లేక ఇప్పటికే 11 పాఠశాలలు మూతబడ్డాయి. గురువారం 'సాక్షి' జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలలను విజిట్ చేయగా, వివిధ సమస్యలు వెలుగుచూశాయి.

పెండింగ్‌లోనే పనులు

జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చేపట్టిన పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. మన ఊరు–మనబడి ద్వారా 2021–22లో 237 పాఠశాలల్లో పనులు చేపట్టారు. వీటి కోసం రూ.51కోట్లు అంచనా వేశారు. ఈ నిధులతో అదనపు తరగతి గదులు, మేజర్, మైనర్ మరమ్మతులు, విద్యుత్, తాగునీటి వసతి తదితర పనులు చేపట్టేందుకు నిర్ణయించారు. ఈజీఎస్ కంపోనెంట్ కింద రూ.43.62 కోట్ల పనులకు అంచనా వేశారు. ఈ నిధుల ద్వారా మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లు, ప్రహరీలు నిర్మించేందుకు ప్రణాళికలు తయారు చేశారు. జిల్లాలో 141 ప్రాథమిక పాఠశాలలు, 36 యూపీఎస్, 60 ఉన్నత పాఠశాలల్లో పనులకు అంచనాలు వేశారు. అయితే 200 పాఠశాలల్లో రూ.30 లక్షల్లోపు పనులు, 37 పాఠశాలల్లో రూ.30లక్షలకు పైగా పనులకు అంచనా వేశారు. రూ.30లక్షల లోపు వాటిని ఎస్ఎంసీ కమిటీలు, రూ.30లక్షలు పైబడిన పనులను కాంట్రాక్టర్లు చేపట్టారు. 2023 జూన్ 23 వరకు చేపట్టిన పనులకు రూ.23.58 కోట్ల బిల్లులు వచ్చాయి. మిగతా వాటికి బిల్లులు పెండింగ్‌లో ఉండగా పనులు నిలిచిపోయాయి. దాదాపు కాంట్రాక్టర్లకు రూ.7.61 కోట్లు రావాల్సి ఉంది. దీంతో తరగతి గదులు, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. గత విద్యాసంవత్సరంలో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా 649 పాఠశాలల్లో పనులు చేపట్టారు. మైనర్ రిపేర్లు, తాగునీరు, మరుగుదొడ్ల మరమ్మతులు, విద్యుద్ధీకరణ, బాలికల మరుగుదొడ్ల పనులు చేపట్టారు. వీటికోసం రూ.30 కోట్లు అంచనా వేశారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన పనులు దాదాపు పూర్తయ్యాయి. కొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణాలు, ఇతర పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

సారున్నా.. విద్యార్థులు లేరు



నేరడిగొండ: విద్యార్థులు లేని సవర్గాం పాఠశాలలో ఉపాధ్యాయుడు జాదవ్ హేమాజీ

నేరడిగొండ: మండలంలోని సవర్గాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు గురువారం ఒక్కవిద్యార్థి హాజరు కాలేదు. ఉపాధ్యాయుడు జాదవ్ హేమాజీ ఒక్కరే పాఠశాలలో కూర్చున్నారు. గ్రామంలో 40 కుటుంబాలున్నా ఒక్క విద్యార్థి కూడా ఈ పాఠశాలకు రావడంలేదు. ఈ విషయమై ఉపాధ్యాయుడు జాదవ్ హేమాజీని ఆరా తీస్తే నిత్యం గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నా ఎవరూ పిల్లలను పంపించడం లేదని తెలిపారు. కాగా, దర్బ గ్రామంలో ఉపాధ్యాయులు లేక పాఠశాల మూసివేయడం గమనార్హం.

చినుకులు పడితే బడి మూశారట!



ఉట్నూర్‌రూరల్: మూసి ఉన్న పాత ఉట్నూర్ ప్రాథమిక పాఠశాల

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని పాత ఉట్నూర్‌లోగల 42 మంది విద్యార్థులు, ముగ్గురు టీచర్లున్న ప్రాథమిక పాఠశాల సాయంత్రం 3–35 గంటలకే మూసి ఉంది. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మదన్‌మోహన్‌ను ఫోన్‌లో సంప్రదించగా చినుకులు పడితే విద్యార్థులను ఇళ్లకు పంపించి తామూ వెళ్లిపోయామని తెలిపారు. విషయం ఎంఈవో ఆశన్న దృష్టికి తీసుకెళ్లగా బడిని ముందే మూసివెళ్లడం సరికాదని తెలిపారు. ఉట్నూర్‌లోని ఎస్సీకాలనీ ఎంపీపీఎస్‌లో 40మంది విద్యార్థులకు నలుగురు టీచర్లుండగా ఇద్దరు సెలవులో ఉన్నారు.

సుంకిడిలో శిథిల'బడి'



తలమడుగు: సుంకిడి గ్రామంలోని జెడ్పీఎస్ఎస్‌లో శిథిల భవనం

తలమడుగు: మండలంలోని సుంకిడి జెడ్పీహెచ్ఎస్ పురాతన భవనం శిథిలావస్థకు చేరింది. విద్యార్థులు భయాందోళనకు గురవుతుండగా అధికారులు 8, 9, 10 తరగతులను ప్రాథమిక పాఠశాల ఆవరణలోని తరగతి గదిలోకి మార్చారు. శిథిల భవనాన్ని తొలగించి నూతన భవనం నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సెలవులు ముగిసినా బడి తెరువలే..



ఇంద్రవెల్లి: లింగపూర్ పాఠశాలలో ఉపాధ్యాయుడు లేక ఖాళీగా విద్యార్థులు

ఇంద్రవెల్లి: మండలంలోని తుమ్మగూడ, గోపాల్‌సింగ్‌తండా, కేస్లాగూడ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి నల్లాలు నిరుపయోగమయ్యాయి. విద్యార్థులు ఇళ్ల నుంచే బాటిళ్లలో నీళ్లు తెచ్చుకుంటున్నారు. మరుగుదొడ్లు మరమ్మతుకు నోచుకోవడం లేదు. వడగామ్ పంచాయతీ పరిధి లింగపూర్ టీడబ్ల్యూపీఎస్‌లో 18 మంది విద్యార్థులుండగా ఉపాధ్యాయుడు లేక సెలవుల తర్వాత పాఠశాల ఇంకా తెరుచుకోలేదు. విద్యార్థులు ఆడుతూ కనిపించారు. ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయుడు బదిలీ కావడంతో మరో ఉపాధ్యాయుడిని నియమించలేదు.

జల్దా బడి.. సమస్యల ఒడి



ఇచ్చోడ: జల్దా ప్రాథమిక పాఠశాలలో నిరుపయోగంగా మూత్రశాలలు, మరుగుదొడ్డి

ఇచ్చోడ: మండలంలోని జల్దా ప్రాథమిక పాఠశాలను సందర్శించగా సమస్యలు వెలుగుచూశాయి. పాఠశాల ప్రధాన ద్వారం తలుపులు పగిలిపోయాయి. మరుగుదొడ్డి, మూత్రశాలలు నిరుపయోగమయ్యాయి. ప్రహరీ లేక ఆవరణలోకి పశువులు సంచరిస్తున్నాయి. 28 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులుండగా గురువారం 15మంది విద్యార్థులే హాజరు కావడం గమనార్హం.

విజిట్‌లో వెల్లడైన అంశాలు

- జిల్లా కేంద్రంలోని కేఆర్‌కే ఉర్దూ మీడియం పాఠశాలలో 1 నుంచి 10వ తరగతి వరకు బోధిస్తున్నారు. 430 మంది విద్యార్థులకు తొమ్మిది మంది ఉపాధ్యాయులుండగా, ఇద్దరిని డిప్యూటేషన్‌పై పంపించారు. ప్రస్తుతం ఏడుగురు పనిచేస్తున్నారు. ఇందులో ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లు, ఐదుగురు ఎస్జీటీలున్నారు. 1, 2 తరగతుల విద్యార్థులను ఒకచోట, 3, 4 తరగతులు మరొక చోట, 6,7 తరగతుల విద్యార్థులను ఇంకో చోట కూర్చోబెట్టి బోధిస్తున్నారు. పదో తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, ఫిజికల్ సైన్స్, సోషల్, ఉర్దూ బోధించేవారు లేరు.
- మావల మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు మన ఊరు–మనబడి కింద భవనం మంజూరైంది. నిధులు కూడా రావడంతో స్లాబ్ వేసి వదిలిపెట్టారు. దీంతో ఏడో తరగతి విద్యార్థులు ఆరుబయటే కూర్చోవాల్సిన పరిస్థితి. ఆరో తరగతి గది వర్షానికి ఉరుస్తోంది. దీంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. తరగతి గదిలో బోర్డు లేక పాఠాలు చెప్పేందుకు ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- బేల మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో తొమ్మిది తరగతులు నిర్వహిస్తున్నారు. 119 మంది విద్యార్థులుండగా ఒకే ఉపాధ్యాయుడున్నారు. ఉర్దూ మీడియానికి బదులు తెలుగు, మరాఠీ మీడియం ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడంతో పాఠాలు అర్థం కావడం లేదని విద్యార్థులు చెబుతున్నారు.
- తాంసి మండలంలోని కప్పర్ల గ్రామంలోగల ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి కాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. 310మంది విద్యార్థులుండగా ఇదివరకు ఉన్న వాటిని బాలికలు ఉపయోగిస్తున్నారు.
- ఆదిలాబాద్ పట్టణంలోని కొమురంభీం కాలనీలోగల ప్రాథమిక పాఠశాలలో 81మంది విద్యార్థులున్నారు. ఒక రెగ్యులర్ ఉపాధ్యాయుడు ఉండగా, ఇద్దరినీ డిప్యూటేషన్‌పై పంపించారు. బడి అద్దె భవనంలో కొనసాగుతోంది. వరండా, మరో గదిలో తరగతులు బోధిస్తుండగా విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.
- బజార్‌హత్నూర్ మండలం బలాన్‌పూర్‌లో గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థలో ఉంది. వర్షం పడితే స్లాబ్ ఉరుస్తోంది. మరుగుదొడ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. పాఠశాలలో ఎనిమిది మంది విద్యార్థులుండగా, ఒక ఉపాధ్యాయుడున్నారు.
- జైనథ్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మన ఊరు–మనబడి కింద రూ.80 లక్షలతో చేపట్టిన భవన నిర్మాణం పూర్తి కాలేదు. బిల్లులు రాకపోవడంతో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో తరగతి గదులు సరిపడా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.
- సిరికొండ మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలోగల ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లు అపరిశుభ్రంగా కనిపించాయి. దీంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఈ పాఠశాలలో 16 మంది విద్యార్థులు చదువుతున్నారు.

పెన్షన్ల పంపిణీలో అక్రమాలకు తావివ్వొద్దు

- కలెక్టర్ రాజర్షి షా
- 'చేయూత' అమలుపై వర్క్‌షాప్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: పెన్షన్ల పంపిణీలో అక్రమాలకు తావు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. చేయూత పథకం (సామాజిక భద్రత పెన్షన్లు) అమలుపై జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ–సెర్ప్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ బిల్ కలెక్టర్లకు పట్టణంలోని ఎస్టీయూ భవన్‌లో గురువారం వర్క్‌షాపు నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ హాజరై దిశానిర్దేశం చేశారు. అనర్హులను ఏరివేయడంతో పాటు మరణించిన వారి పేర్లు జాబితాల నుంచి తొలగించాలని ఆదేశించారు. లబ్ధిదారులకు సకాలంలో పెన్షన్లు అందించేలా శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. పెన్షన్‌కు అర్హులై సదరం సర్టిఫికెట్ లేనివారు యూడీఐడీ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ సమాచారాన్ని సమగ్రంగా నమోదు చేయాలని తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అవార్డులు పొందే దిశగా కార్యదర్శులు, ఎంపీడీవోలు కృషి చేయాలని సూచించారు. పెన్షన్ల పంపిణీలో మార్పులు, దరఖాస్తుల స్వీకరణ, పెన్షన్ల పంపిణీకి చేపట్టాల్సిన చర్యలపై సెర్ప్ డైరెక్టర్ గోపాల్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. పెన్షన్ల పంపిణీలో జరుగుతున్న అక్రమాలను పూర్తిగా నియంత్రించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కేంద్రంలోనే పెన్షన్లను అందించాలని సూచించారు. జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, డీపీవో రమేశ్, ఏపీవో జాదవ్ శేషరావు, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, డీఎల్‌పీవోలు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల సామగ్రి తరలింపు



సామగ్రిని మండలాలకు తరలిస్తున్న సిబ్బంది

కైలాస్‌నగర్: స్థానిక సంస్థల సమరానికి ఎన్నికల సంఘం ఎప్పుడైనా నోటిఫికేషన్ విడుదల చేయవచ్చనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లా పంచాయతీ అధికారులు తాజాగా ఎన్నికల సామగ్రి తరలింపుపై దృష్టి సారించారు. రిటర్నింగ్, ప్రిసైడింగ్ అధికారుల కరదీపికలు, బ్యాలెట్ పేపర్లు, పోలింగ్‌కు ముందు, తర్వాత పీవో చేసే ప్రకటనలు ఉంచే కవరు, మార్క్‌డ్ ఓటర్ల జాబితా లాంటి సామగ్రి నెల కిందటే జిల్లాకు చేరింది. ఈ సామగ్రిని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని పంచాయతీ వనరుల కేంద్రంలో భద్రపర్చారు. ఎన్నికలు నిర్వహించనున్నట్లు వస్తున్న సంకేతాల నేపథ్యంలో సామగ్రిని మండలాల వారీగా వాహనాల్లో తరలిస్తున్నారు. ఇప్పటివరకు బజార్‌హత్నూర్, సొనాల, నేరడిగొండ తదితర తొమ్మిది మండలాలకు సామగ్రి పంపిణీ పూర్తి చేశారు. మరో 11 మండలాలు మిగిలి ఉండగా రెండు, మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో అందజేస్తామని డివిజనల్ పంచాయతీ అధికారి ఫణీందర్‌రావు తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యాక పోలింగ్‌కు ఒక్కరోజు ముందుగా ఈ సామగ్రిని మండల కేంద్రంలోని రిసెప్షన్ కేంద్రంలో ఎన్నికల సిబ్బందికి అందజేస్తామన్నారు. నోటిఫికేషన్ ఎప్పుడొచ్చినా ఎన్నికలు నిర్వహించేలా పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు.

యూరియా బ్లాక్ చేయకుండా చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

ఆదిలాబాద్‌టౌన్: యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్‌స్వామి తెలిపారు. 'బ్లాక్‌లో యూరియా.. దొడ్డిదారిన బడాబాబుల చెంతకు' శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. తాంసి ప్రాథమిక సహకార సంఘంలో 40 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. వానాకాలం పంటకు జూన్ వరకు 18,786 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. రైతులకు ఇతర ఎరువులు బలవంతంగా ఇవ్వరాదని సూచించారు. డీలర్లతో సమావేశమై నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెండింగ్ కేసులు పర్యవేక్షించాలి

ఆదిలాబాద్‌టౌన్: కోర్టుల్లో పెండింగ్ కేసులను పర్యవేక్షించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. గురువారం ఏఆర్ హెడ్‌క్వార్టర్ సమావేశ మందిరంలో పోలీస్ సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, న్యాయస్థానాల్లో నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సాయంత్రం వేళ డ్రంకెన్ డ్రైవ్, హైవేల్లో స్పీడ్ లేజర్ గన్‌లు, సైన్‌బోర్డులు, రంబుల్‌స్టిక్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామాల నుంచి హైవేలకు వచ్చే దారుల్లో స్పీడ్ బ్రేకర్లు ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. నేరస్తులు క్రమంతప్పకుండా కోర్టుకు హాజరయ్యేలా పర్యవేక్షించాలని పేర్కొన్నారు. హాజరుకాని పక్షంలో వారెంట్లు తీసుకుని నిందితులకు అందజేయాలని సూచించారు. హైవేపై బ్లాక్‌స్పాట్, హాట్‌స్పాట్‌లను గుర్తించి ఎలాంటి సమస్యలున్నా పరిష్కరించాలని వివరించారు. ఎస్పీ వెంట ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్, డీఎస్పీలు ఎల్.జీవన్‌రెడ్డి, నాగేందర్ తదితరులున్నారు.

ఉట్నూర్‌లో 'మై టాక్సీ ఈజ్ సేఫ్'



ఆటోకు పోస్టర్ అతికిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ సబ్ డివిజన్ కార్యాలయం ఎదుట, ఉట్నూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్‌తో కలిసి 'అభయ మై టాక్సీ ఈజ్ సేఫ్' కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో యువతులు, మహిళా ప్రయాణికుల భద్రత చర్యల్లో భాగంగా జిల్లాలో ఇప్పటివరకు 3,232 ఆటోల్లో 'అభయ మై టాక్సీ ఈజ్ సేఫ్' రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నట్లు చెప్పారు. ఇందులో ఉట్నూర్ సబ్ డివిజన్‌లో 850 ఆటోల రిజిస్ట్రేషన్ పూర్తయినట్లు తెలిపారు. ఆటోల్లో ముందు, వెనుక భాగంలో క్యూఆర్ కోడ్, జిల్లా ప్రత్యేక నంబర్ కలిగిన పోస్టర్ అతికించి, లోపలి భాగంలో ఆటో డ్రైవర్ వివరాలు, క్యూఆర్ కోడ్, ఆటో రిజిస్ట్రేషన్ నంబర్ కనబడేలా పోస్టర్లను శాశ్వతంగా అతికిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఎక్కిన వెంటనే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన తర్వాత ఒక వెబ్ అప్లికేషన్ వస్తుందని తెలిపారు. అందులో మొబైల్ నంబర్ ఎంటర్ చేసిన తర్వాత వారికి మూడు భద్రత ఆప్షన్లు 'ట్రాక్ మై లొకేషన్, ఎమర్జెన్సీ కాల్, కంప్లయింట్' కనబడతాయని పేర్కొన్నారు. మహిళలు అత్యవసర సమయంలో దీనిని ఉపయోగించుకోవాలని సూచించారు. ఉత్తమ రేటింగ్ కలిగిన ఆటో డ్రైవర్లు, యజమానులకు అవార్డులు అందించి ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. నేరాల నియంత్రణ, నేరాల అదుపునకు ప్రతి ఒక్కరూ 'అభయ మై టాక్సీ ఈజ్ సేఫ్' కార్యక్రమంలో పాల్గొనాలని ఎస్పీ పిలుపునిచ్చారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. స్వయంగా ఆటోల వద్దకు వెళ్లి పోస్టర్ అతికించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీఐ మొగిలి, ఎస్సై మనోహర్ తదితరులున్నారు.

విమానాశ్రయ పనులు ప్రారంభించాలి



జేఎస్ మహంతితో ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలో వీలైనంత త్వరగా ఎయిర్‌ఫోర్స్, విమానాశ్రయ పనులు ప్రారంభించాలని ఐఏఎఫ్ అధికారి జేఎస్ మహంతిని ఆదిలాబాద్ ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. గురువారం ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి అనువైన స్థలం ఉందని తెలిపారు. ఈ మేరకు ఐఏఎఫ్ అధికారి సానుకూలంగా స్పందిస్తూ వీలైనంత త్వరలో జాయింట్ ఐఏఎఫ్, ఏఏఐ సమావేశం నిర్వహించనున్నట్లు హామీ ఇచ్చినట్లు ఎంపీ, ఎమ్మెల్యే తెలిపారు.

క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌వీ నాయకుడిపై దాడి



ఆస్పత్రిలో బాధితుడు మధూకర్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో గురువారం రాత్రి నస్పూర్‌కు చెందిన బీఆర్‌ఎస్‌వీ నాయకుడు దగ్గుల మధూకర్‌పై కొందరు వ్యక్తులు దాడి చేసిన ఘటన కలకలం రేపింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు నస్పూర్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సురిమిల్ల వేణు, మధూకర్ చిన్ననాటి స్నేహితులు. చాలా కాలం తర్వాత ఇద్దరూ కలుసుకోవడంతో నస్పూర్‌లో మందుపార్టీ చేసుకున్నారు. అనంతరం ఇద్దరూ కలిసి జిల్లా కేంద్రంలోని ప్రముఖ రియల్టర్ జగన్ మోహన్‌రావు ఇంటికి వెళ్లారు. అక్కడికి వెళ్లిన కొద్దిసేపటికి అరికె రాజేశ్, కుమార్, వంశీ మధూకర్‌పై దాడి చేశారు. తలకు గాయం కావడంతో తప్పించుకుని పారిపోయి స్నేహితులకు సమాచారం అందించగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు ఆస్పత్రికి చేరుకున్నారు. సీఐ ప్రమోద్‌రావు ఆస్పత్రికి చేరుకుని వివరాలు సేకరించారు.

రైతు వేదికలో చోరీ

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట రైతు వేదికలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ముందు వైపు తాళాన్ని పగులగొట్టి లోనికి చొరబడ్డారు. గురువారం ఉదయం వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉందని, లోనికి వెళ్లి చూడగా కంప్యూటర్, స్పీకర్లు ఎత్తుకెళ్లినట్లు ఏఈవో సాయికృష్ణ తెలిపారు. ఈ విషయమై చెన్నూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. పట్టణ సీఐ దేవేందర్‌రావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

పట్టపగలే సినీఫక్కీలో..

లక్సెట్టిపేట: పట్టణంలో పట్టపగలే సినీఫక్కీలో చోరీ జరగడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మండలంలోని కొమ్ముగూడెంకు చెందిన వ్యాపారి కిషన్ గురువారం మధ్యాహ్నం పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణం వద్దకు వచ్చి లక్ష రూపాయల నగదు తీసుకుని బైక్ ట్యాంక్ కవర్‌లో పెట్టుకుని స్థానిక బీట్ బజార్ నుండి బస్టాండు వైపు బయల్దేరాడు. గాంధీచౌక్ సమీపంలోకి వెళ్లగానే ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి డబ్బులు కింద పడ్డాయని చెప్పడంతో కిషన్ బైక్ ఆపి కిందకు చూస్తుండగా కవర్‌లో ఉన్న నగదు పట్టుకుని పారిపోయారు. బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

ఆదిలాబాద్‌లో ఇంట్లో..

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన పఠాన్ ఇమ్రాన్‌ఖాన్ ఇంట్లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడు కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి ఆవరణలో నిద్రపోయాడు. దొంగలు ఇంట్లో చొరబడి 15 తులాల వెండి, 14 గ్రాముల బంగారం దోచుకెళ్లారు. ఉదయం లేచి చూసేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో బాధితుడు టూటౌన్ పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేయగా సీఐ కరుణాకర్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

అటవీ సిబ్బందిపై దాడికి యత్నించిన వ్యక్తిపై కేసు

భీమారం: రిజర్వు ఫారెస్ట్ నుంచి ట్రాక్టర్‌లో ఇసుక అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్న అటవీశాఖ సిబ్బందిపై దాడికి యత్నించిన బూర్గుపల్లి గ్రామానికి చెందిన బుక్యా రాజ్‌కుమార్‌నాయక్‌పై గురువారం కేసు నమోదు చేసినట్లు మంచిర్యాల రేంజ్ ఆఫీసర్ రత్నాకర్‌రావు తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 25న దాంపూర్ అటవీ ప్రాంతంనుంచి ఇసుక తరలిస్తుండగా అటవీశాఖ సిబ్బంది మార్గమధ్యలో ఆపి ట్రాక్టర్‌ను మంచిర్యాలలోని రేంజ్ ఆఫీస్‌కు తరలిస్తుండగా రాజ్‌కుమార్ వారిపై దాడికి యత్నించి ట్రాక్టర్ తీసుకెళ్లాడు. నోటీసులు ఇచ్చేందుకు బూర్గుపల్లిలోని అతని ఇంటికి వెళ్లగా కుటుంబ సభ్యులు దుర్భాషలాడారన్నారు. గతంలో కూడా మూడుసార్లు ఇసుక తరలిస్తుండగా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

హైదరాబాద్‌లో కప్పర్లవాసి ఆత్మహత్య



శంకర్ (ఫైల్)

తాంసి: మండలంలోని కప్పర్లకు చెందిన జాజిమొగ్గ శంకర్ (58) గురువారం హైదరాబాద్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సవిత తెలిపారు. కప్పర్ల గ్రామానికి చెందిన శంకర్ కొంతకాలంగా ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. బోరబండ సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ కళాశాలలో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో కళాశాల ఆవరణలో ఉరేసుకున్నాడు. గురువారం ఉదయం గమనించిన సిబ్బంది పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని భార్య పొచ్చు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు దుండిగల్ ఎస్సై తెలిపారు.

పోడు.. తీరని గోడు!



పోడు సాగు చేస్తున్న రైతు(ఫైల్)

- పట్టాలు ఇచ్చినా ఇంకా సమస్యలే
- కొన్నిచోట్ల అనర్హులకు హక్కుల కల్పన
- మరికొన్ని చోట్ల అర్హులకు దక్కని అవకాశం
- విత్తనం వేసే వేళ అధికారులు, సాగుదారులకు ఘర్షణ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అటవీ భూముల సాగుపై వివాదం ఆగడం లేదు. ఏటా వానాకాలం విత్తనాలు వేసే వేళ అటవీ అధికారులు, ఆక్రమణదారుల మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. పట్టా లేకుండా సాగు చేస్తే వారి నుంచి తిరిగి స్వాధీనం చేసుకుంటున్నారు. శాటిలైట్ మ్యాపులతో నిర్ధారిస్తూ మొక్కలు పెడుతున్నారు. రెవెన్యూ పట్టాలు ఉన్నప్పటికీ అటవీ భూమిగా రికార్డుల్లో ఉంటే స్వాధీనం చేసుకుంటున్నారు. కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ మండలం అంకుశాపూర్ గిరిజన రైతులు, మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం చామనపల్లికి చెందిన దళిత రైతులకు రెవెన్యూ పట్టాలు ఉన్నప్పటికీ అటవీ భూమిగా స్వాధీనం చేసుకునే క్రమంలో ఇరువర్గాల్లో గొడవ జరుగుతోంది.

రెండుసార్లు పట్టాలిచ్చినా..

ఉమ్మడి ఏపీలో దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో పోడు భూములకు పట్టాలు ఇచ్చారు. 2023లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 1,50,012 మంది రైతులకు 4,05,601 ఎకరాల భూమికి ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు అందజేశారు. ఇందులో అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పట్టాలు అందజేయగా రెండో స్థానంలో మహబూబాబాద్ జిల్లా గిరిజనులకు పట్టాలిచ్చారు. అర్హులను గుర్తించేందుకు ఆర్వోఎఫ్‌ఆర్(అటవీ హక్కుల గుర్తింపు చట్టం) 2006 ప్రకారం సాగు హక్కులు కల్పించాలని జీవో 140 ప్రకారం దరఖాస్తులు స్వీకరించింది. ఎఫ్‌ఆర్సీ(ఫారెస్టు రైట్స్ కమిటీ)లను పోడు సాగు గ్రామాల నుంచే సభ్యులను ఎంపిక చేసి క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలన చేశారు. ప్రధాన నిబంధనల్లో గిరిజనులు 2005 డిసెంబర్ 12 నాటికే అటవీభూమి సాగులో ఉండాలి. గిరిజనేతరులు 75 ఏళ్లు అంటే 1930 కంటే ముందు నుంచి లేదా మూడు తరాలు సాగులో ఉన్నట్లు రుజువు అడిగారు. బీట్ ఆఫీసరు, గ్రామ రెవెన్యూ అధికారి, పంచాయతీ కార్యదర్శి పరిశీలన చేసి సంతకాలు తీసుకున్నారు. గిరిజనేతరులు సాగులో ఉన్నా పట్టాలు రాలేదు.

అనర్హులకు అటవీ భూమి

మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడ, గంగారం, గూడూరు మండలాల్లో ప్రభుత్వ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, అటవీ శాఖతో పాటు ఇతర ప్రభుత్వ ఆఫీసుల్లో ఉద్యోగాలు చేస్తున్న దాదాపు 120 మంది ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాలు పొందారు. ఇందుకు రూ.లక్షలు ఖర్చు చేసి దొడ్డి దారిన ఎకరాల కొద్దీ అటవీభూమి తమపరం చేసుకున్నారు. కుమురంభీం జిల్లాలో కెరమెరి, జైనూర్, దహెగాం మండలాల్లో కొందరు గిరిజనేతరులు సాగులో ఉన్న భూములకు గిరిజనుల పేర్లు వాడుకుని ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాలు చేయించారు. సిర్పూర్ నియోజకవర్గంలో అక్రమంగా కొందరు గిరిజనేతరులు పట్టాలు పొందాక, తర్వాత రద్దు చేశారు.

నిత్యం ఘర్షణ

శాటిలైట్ మ్యాపులతో గతంలో ఉన్న అటవీ, ప్రస్తుతమున్న పరిస్థితిని పోల్చుతూ అటవీ అధికారులు ఆక్రమణలు తిరిగి స్వాధీనం చేసుకునే పనిలో ఉన్నారు. ఏటా విత్తనాలు వేసే సమయంలో రైతులు, అటవీ అధికారుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంటోంది. మంచిర్యాల, కొత్తగూడెం, ములుగు, ఆదిలాబాద్, కుమురంభీం జిల్లాల్లో మళ్లీ సర్వే చేసి అర్హులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

మాపై కేసులు పెట్టారు



మేము మూడెకరాలు పోడు సాగు చేసుకుంటున్నాం. మా గ్రామాన్ని పోడు సాగులో గుర్తించకపోవడంతో సర్వే చేయలేదు. పట్టాలు ఇవ్వలేదు. ఫారెస్టు అధికారులు వచ్చి మీకు పట్టా లేదు.. భూమి దున్నకూడదని అంటూ మాపై కేసులు పెట్టారు. మా గ్రామంలోనూ సర్వే చేసి పట్టాలు ఇవ్వాలి.

– మర్మల మల్లేశ్వరి, బుయ్యారం, వేమనపల్లి, మంచిర్యాల

అర్హులని గుర్తించినా పట్టా ఇవ్వలే



ఉమ్మడి ఏపీలోనే అర్హులుగా గుర్తించినా మాకు పట్టా ఇవ్వలేదు. రెండేళ్ల క్రితం సర్వేలోనూ మాకు పట్టా ఇవ్వలేదు. ఇప్పుడు భూమి సాగు చేసుకుంటుంటే అటవీ అధికారులు వచ్చి మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారు.

– గుజిగంటి ప్రకాశ్, ఇందన్‌పల్లి, జన్నారం, మంచిర్యాల

సాగు కష్టాలు



అర్క ముందు ఎడ్లను లాగుతున్న మహిళ

ఖరీఫ్ ప్రారంభంతోనే రైతులకు సాగు కష్టాలు మొదలయ్యాయి. మండలంలోని జల్దా గ్రామంలో జాదవ్ చందులాల్ అనే గిరిజన రైతు గురువారం తమ పత్తిచేనులో దౌర కొడుతున్నాడు. కానీ ఎద్దులు కలుపుడు కంకలు కావడంతో సరిగ్గా నడవలేక పోయాయి. దీంతో అరకకు తాడుకట్టి రైతు భార్య ముందు నడుస్తుంటే కలుపుడు కంకలు ఆమెను అనుసరించాయి. ఈ దృశ్యం సాగులో రైతు పడుతున్న కష్టానికి అద్దం పడుతోంది.

– ఇచ్చోడ

ఇళ్లస్థలాలు ఇప్పిస్తానని మోసగించిన వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వం ద్వారా ఇళ్లస్థలాలు ఇప్పిస్తానని ప్రజల వద్ద డబ్బులు తీసుకుని మోసగించిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ పట్టణంలోని మసూద్‌నగర్‌కు చెందిన మహ్మద్ తాజొద్దీన్ అలియాస్ షాకీర్ నిర్మల్ కోర్టులో టైపిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదిలాబాద్ పట్టణంలో పదుల సంఖ్యలో బాధితుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.లక్షన్నర వరకు తీసుకున్నాడు. ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ, ఖానాపూర్ శివారులోని సర్వే నం.29/1లో ఖాళీ ప్రదేశాలను చూపించి జిరాక్స్ నకిలీ పత్రాలను వారికి అందించి మోసగించాడు. బాధితులు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి నిందితుడిని భైంసాలో అరెస్టు చేసినట్లు తెలిపారు. గతంలో కూడా ఇతనిపై పలు కేసులు నమోదైనట్లు వివరించారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఈసెట్ కౌన్సెలింగ్



ధ్రువీకరణ పత్రం పరిశీలిస్తున్న అధికారి

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ కేంద్రంలో చేపట్టిన టీఎస్‌ఈసెట్–2025 కౌన్సెలింగ్ గురువారంతో ముగిసింది. అధికారులు మూడు రోజుల పాటు అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. 575 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకోగా 564 మంది కౌన్సెలింగ్‌కు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.దేవేందర్ తెలిపారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్

జైపూర్: నకిలీ పత్తి విత్తనాలు తరలిస్తున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. జైపూర్ అసిస్టెంట్ కమిషనరేట్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. బుధవారం సాయంత్రం కోటపల్లి పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులతో కలిసి రాపనపల్లి అంతరాష్ట్ర బ్రిడ్జి వద్ద తనిఖీలు చేస్తుండగా కిష్టాపూర్‌కు చెందిన గూడ మనోహర్‌రెడ్డి కారులో 48.6 కిలోల పత్తి విత్తనాలు లభ్యమయ్యాయి. వాటి విలువ రూ.1,45,800 ఉంటుందన్నారు. సిరోంచకు చెందిన చింతవార్ శ్రీనివాస్, సింగిడివార్ నరేశ్‌తో కలిసి నాగపూర్‌లో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద కొనుగోలు చేసి మంచిర్యాల జిల్లాతో పాటు మహారాష్ట్రలో విక్రయించేందుకు తీసుకువస్తున్నట్లు ఒప్పుకున్నాడు. మనోహర్‌రెడ్డి పట్టుబడగా మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. 2018, 2025లో కూడా మనోహర్‌రెడ్డిపై జైపూర్, తాండూర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైనట్లు తెలిపారు. సమావేశంలో చెన్నూర్, శ్రీరాంపూర్ సీఐలు దేవేందర్‌రావు, వేణుచందర్, కోటపల్లి ఎస్సై రాజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై ఏఐటీయూసీ పోరాటం



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

మందమర్రిరూరల్: సింగరేణి కార్మికుల సమస్యలపై గుర్తింపు కార్మిక సంఘమైన ఏఐటీయూసీ పోరాడుతోందని ఆ సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. గురువారం ఏరియాలోని కేకే–5 గనిపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చామన్నారు. కార్మికుల సొంతింటి కల, పెర్క్స్‌పై ఇన్‌కంట్యాక్స్ రద్దు విషయంలో మంత్రి వివేక్‌ను కలిసి విన్నవించామన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆ యూనియన్‌లో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. సమావేశంలో యూనియన్ ఏరియా బ్రాంచి కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు అక్బర్‌అలీ, సుదర్శన్, మల్లేశ్, కంది శ్రీనివాస్, సంపత్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఒకరి రిమాండ్



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్సై

కాసిపేట: మండలంలోని పెద్దనపల్లిలో చోరీకి పాల్పడిన ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన పుత్తక వేణుగోపాల్ తన చెల్లితో కలిసి బెల్లంపల్లి మార్కెట్‌కు వెళ్లి వచ్చేసరికి ఇంటితాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువాలోని రూ.3 వేల నగదు దొంగిలించినట్లు గుర్తించాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా మధ్యాహ్నం నిందితుడు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ప్రస్తుతం చంద్రవెల్లిలో ఉంటున్న మహ్మద్ నదీంను మధుర జంక్షన్ వద్ద పట్టుకున్నారు. దొంగిలించిన నగదును సీజ్ చేసి రిమాండ్‌కు తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి



శ్రీనివాస్ (ఫైల్)

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట శివారులో గల బుగ్గ గట్టు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బొలిశెట్టి శ్రీనివాస్ (42) మృతి చెందినట్లు హాజీపూర్ ఎస్సై స్వరూప్ రాజ్ తెలిపారు. ముల్కల్లకు చెందిన శ్రీనివాస్ లక్సెట్టిపేటలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం రాత్రి విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, ఏసీపీ ప్రకాశ్ పరిశీలించారు. మృతునికి భార్య జ్యోతి, కుమారుడు అభిరామ్, కుమార్తె శ్రీజ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అత్యాచారం కేసులో మూడేళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్: యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.8 వేల జరిమానా విధిస్తూ జిల్లా మొదటి అదనపు జడ్జి శివరాంప్రసాద్ గురువారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి పండరి తెలిపారు. నార్నూర్ మండలంలోని బాబేఝరి గ్రామానికి చెందిన ఓ యువతిని బేల మండలంలోని పాటగూడకు చెందిన జలపత్‌రావు నమ్మించి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. గర్భం దాల్చడంతో వేరే పెళ్లి చేసుకోవాలని, తనకు సంబంధం లేదని పేర్కొన్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై శ్రీకాంత్ 2017 జూన్ 5న కేసు నమోదు చేశారు. ఆడ శిశువు జన్మించగా డీఎన్‌ఏతో నిందితుడు తండ్రిగా నిర్ధారణ అయ్యింది. పది మంది సాక్షులను కోర్టులో హాజరుపర్చగా పీపీ సంజయ్ కుమార్ వైరాగ్రే నేరం రుజువు చేశారు. ఈ మేరకు జడ్జి పైవిధంగా తీర్పునిచ్చినట్లు వివరించారు.

మట్కా నిర్వాహకుల అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన ఫర్జాన, షబాన ఆన్‌లైన్ ద్వారా మట్కా నిర్వహణ చేపడుతుండగా సమాచారం తెలుసుకున్న పోలీసులు గురువారం దాడిచేసి పట్టుకున్నారు. మహారాష్ట్రలోని బోరికి చెందిన అశోక్ సామ్రాట్‌కు ఫోన్ ద్వారా మట్కా చీటీలను పంపుతున్నారు. వీరి నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ.15 వేల నగదు స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితులను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు వివరించారు.

ఇంకుడు గుంత.. మేలు కొండంత

- భూగర్భ జలాల పెంపునకు దోహదం
- ఉపాధిహామీ పథకం కింద నిర్మించుకునే అవకాశం
- సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన



సుద్దాలలో నిర్మించిన ఇంకుడుగుంత

చెన్నూర్‌రూరల్: వర్షాలు సక్రమంగా కురియకపోవడం, దీనికి తోడు వేసవిలో భానుడి ప్రతాపానికి భూగర్భ జలాలు అడుగంటిపోయి బావులు, వాగులు, కుంటలు, రక్షిత మంచినీటి పథకాలు, చేతిపంపులు, బోరుబావుల్లో నీరు రాకుండా పోతోంది. భూగర్భ జలాలు పెంపొందించేందుకు ఉపాధిహామీ పథకం ద్వారా ఇంకుడు గుంతలు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ఆర్థికసాయం అందజేస్తోంది. ఇంటి పరిసరాల్లో ఇంకుడు గుంత నిర్మించుకుంటే రూ.6వేల వరకు, గ్రామాల్లో బోర్ల వద్ద నిర్మించుకుంటే రూ.14 వేల వరకు చెల్లిస్తుంది. రాబోయే రోజుల్లో భూగర్భజలమట్టం పడిపోయి నీటికి ఇబ్బందులు ఏర్పడే పరిస్థితులు ఉన్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం భవిష్యత్‌లో అలాంటి పరిస్థితులు ఏర్పడకుండా ఉండేందుకు ఇంకుడు గుంతల నిర్మాణానికి ముందుకు వచ్చింది. ఇంకుడు గుంతల నిర్మాణంతో భూగర్భ జలాలు పెరగడంతో పాటు, పరిశుభ్రమైన వాతావరణం నెలకొంటుంది. ఇంటి నుంచి వచ్చే మురుగు నీరంతా ఒకేచోట చేరడంతో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడే అవకాశాలు ఉంటాయి. ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలను నిర్మించుకుని బాత్‌రూంల వద్ద పైప్‌లైన్ ఏర్పాటుచేసి మురుగు నీరంతా అందులోకి వెళ్లేలా చేసుకోవాలి. ఇళ్ల వద్ద ఇంకుడు గుంత నిర్మాణానికి పొడవు.1.2 మీటర్లు, వెడల్పు 1.2 మీటర్లు, లోతు 1.8 మీటర్లు ఉండాలి. గ్రామాలలో బోర్ల వద్ద పొడవు, వెడల్పు, లోతు 2మీటర్ల చొప్పున ఉండేలా నిర్మించుకోవాలి. మండలానికి వంద చొప్పున ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలతో పాటు పంచాయతీకి ఒకటి రెండు చొప్పున మురుగు కాలువల ముగింపు వద్ద నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఈనెలాఖరు వరకు ఇంకుడు గుంతల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు.

దరఖాస్తు విధానం ఇలా..

ఇళ్ల వద్ద ఇంకుడు గుంత నిర్మాణం చేసుకోవాలంటే జాబ్‌కార్డు ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. పంచాయతీ తీర్మానాన్ని ఈజీఎస్ కార్యాలయంలో అందించాలి. అనంతరం ఇంకుడు గుంత నిర్మించే స్థలాన్ని అధికారులు పరిశీలిస్తారు. నిర్మాణం పూర్తయిన వెంటనే బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ అవుతాయి. గ్రామాలలో నిర్మించే పబ్లిక్ ఇంకుడు గుంతల నిర్మాణాల కోసం పంచాయతీ తీర్మాణం అవసరం ఉంటుంది. వ్యక్తిగత, సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణాల్లో తేడా ఉంటుంది. ఇంకుడు గుంత నిర్మాణంలో ముందుగా బెండడి రాళ్లు వేస్తారు. వాటిపై దొడ్డు, సన్నపు కంకరతో పాటు ఇసుక వేసి మధ్యలో గోళం అమర్చి దానికి పైపును బిగిస్తారు. అనంతరం పైన మూతను ఏర్పాటు చేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



వ్యక్తిగత, సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రభుత్వం ఈజీఎస్ ద్వారా డబ్బులు అందజేస్తుంది. గ్రామాలలో ఇంటింటా ఇంకుడు గుంత నిర్మించుకోవాలి. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– గంగాభవాని, ఈజీఎస్ ఏపీవో, చెన్నూర్

బైండోవర్ ఉల్లంఘించిన ఒకరికి జరిమానా

బజార్‌హత్నూర్: మండలంలోని టెంబి గ్రామానికి చెందిన సిడం భీంరావ్ గతంలో గుడుంబా తయారు చేస్తూ ఎక్సైజ్ శాఖ అధికారులకు పట్టుబడటంతో తహసీల్దార్ రూ.50 వేలు బైండోవర్ చేశారు. మళ్లీ గుడుంబా తయారు చేయడంతో బైండోవర్ ఉల్లంఘించినందుకు గురువారం భీంరావ్‌కు రూ.50 వేల జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్ తెలిపారు.

ఒకరి బలవన్మరణం



సత్తయ్య (ఫైల్)

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): మండలంలోని టీకానాపల్లి గ్రామానికి చెందిన చాకపల్లి సత్తయ్య (45) బలవన్మరణానికి పాల్పడినట్లు ఎస్సై స్వరూప్ రాజ్ తెలిపారు. గ్రామానికి చెందిన సత్తయ్య కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ పోషణ, ఇతర కారణాలతో అప్పులు చేయడంతో మానసిక వేదనకు గురయ్యాడు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుని కుమారుడు సిద్దార్థ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరి బైండోవర్

సాత్నాల: బోరజ్ మండలంలోని లేఖర్‌వాడ గ్రామానికి చెందిన కోరిం ఆడేల్లు, పెండల్వాడ గ్రామానికి చెందిన కాపిడే అశోక్‌ను గురువారం తహసీల్దార్ రాజేశ్వరి ఎదుట బైండోవర్ చేశారు. అక్రమంగా దేశీదారు విక్రయిస్తున్న నిందితులపై ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆమె పేర్కొన్నారు.

బాసరలో పోలీసుల మాక్ డ్రిల్



గోదావరిలో మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న ఎస్పీ

బాసర: బాసర గోదావరి నదిలో గురువారం ఎస్పీ జానకీ షర్మిల ఆధ్వర్యంలో పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. శివంగి, స్పెషల్ టీంలు సుమారు 2 గంటల పాటు నదిలో మాక్ డ్రిల్ చేశారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వరద నీటిలో ప్రాణాలు ఎలా కాపాడాలో పోలీస్ అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు.

బంగల్‌పేట్ చెరువులో 82 మందికి శిక్షణ

నిర్మల్‌టౌన్: ఆపత్కాల పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు సన్నద్ధం చేస్తున్నట్లు ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. రాబోయే వర్షాలను దృష్టిలో ఉంచుకుని డిస్ట్రిక్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీడీఆర్ఎఫ్)ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ చెరువులో డీడీఆర్ఎఫ్ బృందానికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ప్రతీ పోలీస్ స్టేషన్ నుంచి ముగ్గురు చొప్పున మొత్తం 82 మందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ ఏఎస్పీ రాజేశ్‌మీనా, ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, క్రిష్ణ, డీడీఆర్ఎఫ్ ఇన్‌చార్జి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

వరుణుడి కరుణకోసం కప్పతల్లి ఆట



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆదిలాబాద్‌టౌన్: వరుణ దేవుడు కరుణ చూపాలని ఆగ్రో ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కప్పతల్లి ఆటలాడారు. స్థానిక పంజాబ్ చౌక్ నుంచి డప్పు చప్పుళ్లతో అశోక్ రోడ్‌లోని పోచ్చమ్మ తల్లి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం దుకాణాదారులు కప్ప, రోలుకు జలాభిషేకం చేశారు.

బేల: మండల కేంద్రంలోని వ్యవసాయ అనుసంధాన వర్కర్స్ ఆధ్వర్యంలో స్థానిక గణేశ్ మందిరంలో వర్షం కోసం ప్రత్యేక పూజలు చేశారు. కప్పతల్లి ఆట ఆడారు. మార్కెట్ కూడలిలోని విత్తన విక్రయ కేంద్రాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. రామ మందిరంలో అన్నదానం చేశారు.

108 ఉద్యోగులకు ముగిసిన శిక్షణ



శిక్షణ పొందిన 108 సిబ్బంది

మంచిర్యాలటౌన్: పట్టణంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో గురువారం మంచిర్యాల, కుమురంభీం జిల్లాల్లోని 108 వాహనాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఈఎంటీ, పైలట్లకు ఈ నెల 16 నుంచి ఇస్తున్న శిక్షణ గురువారంతో ముగిసింది. అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ (ఏఎల్‌ఎస్), సీపీఆర్‌లపై ప్రత్యేక శిక్షణతో పాటు, 108 అంబులెన్సు సర్వీసులను పూర్తిస్థాయి సాంకేతిక పరిజ్ఞానంతో అమలు చేస్తుండడంతో వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం చెన్నూరు ఈఎంటీ పోచన్న, వేమనపల్లి ఈఎంటీ జాడి స్వరూపకు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో 108 రాష్ట్ర ప్రధాన కార్యాలయాల అధికారులు గజేందర్, ప్రమోద్, ప్రధాన అధికారి సూర్యనారాయణ రాజు, ఉమ్మడి జిల్లా 108 వాహనాల ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్, సంపత్, లింగాచారి, సతీశ్ పాల్గొన్నారు.